# పాతపాట కొత్తపాట

కిరణ్మయి

సాహిర్ లూధియాన్వి అంటే మా ఇంట్లో అలాంటి ఇలాంటి అభిమానం కాదు. ఒక పెద్ద ముఠాయే ఉంది. 'సాహిర్', 'సాహిర్' అంటూ పాత హిందీ సినిమాల్లో ఆయన రాసిన పాటల్ని ఎప్పుడూ తలుచుకోవడమే. ఆ ఎస్.డి.బర్మన్ పాట,ఈ రోషన్ పాట కూనిరాగాలు ఎవరో ఒకరు తీస్తూనే ఉంటారు. అందరికీ పాడే పాటలోని ఉర్దూ అంతా అర్థమైందనీ కాదు,ఏంకాదు.అలా ఊరికే తల్చుకోవడానికి సాహిర్ పేరు బావుంటుందనుకుంట- పెద్దరంగుల ప్రపంచంలో చిన్న ఇంద్రధనుస్సులా!

మాదో విచిత్రమైన ఇల్లు (కుటుంబం అనాలేమో!'. హిందీ పాటల పరిచయం లేనివాళ్లు నెగ్గుకు రాలేరు. ఎంత సూక్ష్మంగా పాటలు అర్థమైతే అంత రౌడీలుగా తయారయ్యే వాతావరణం. అందరూ బాగా ఆస్వాదించి అంతోఇంతో పాడేవాళ్ళేనేమో, వాళ్ళవాళ్ళ మనస్తత్వాలు, బెంట్ ఆఫ్ మైండ్‌ని బట్టి ఒక్కొక్క పాత మ్యూజిక్ డైరెక్టర్‌నో, కవినో భుజాలమీద వేసుకు తిరుగుతారు.

మాలో అతివాదులు, మితవాదులు, పూర్తి మిలిటెంట్లు, పూర్తి డిప్లొమాట్‌లు ఉన్నారు. ఒక మ్యూజిక్ డైరెక్టర్ లోపాలు విప్పి చెప్పడంలో ఎంతో శక్తియుక్తులు ప్రదర్శిస్తారు. వాళ్ళ ముఠా మ్యూజిక్ డైరెక్టర్ గొప్ప క్వాలిటీలు చాటి చెప్పుకోవడానికి పాత ఫిల్మ్‌ఫేర్ల నుంచి వాళ్ళని వీళ్ళని కోట్ చేసి పారేస్తుంటారు. 'లతా ఇలా అంటే అసలెవరైనా ఊరుకుంటారా?' 'ఆశా ఆపాట పాడినతర్వాతే ఓ.పి.నయ్యర్‌కి పాడడం ఆపేసింది' 'రఫీకి లతాకి దెబ్బలాట వచ్చినప్పుడు...' ఈ వివరాల లిస్టు ఇవ్వడం 'అలీఫ్, బే, తే'లు వరసలో (అట్నుంచి) గుర్తు పెట్టుకోవడం కంటే కష్టం.

అసలు గొడవంతా ఎక్కడ వస్తుందంటే మావాళ్ళు ఈ కబుర్లు చెప్పుకుంటూ, పాటలు పాడేసుకుంటూ ముస్లింల గురించి, ఉర్దూ భాష గురించి తమకి తెలిసినంత మరెవరికి తెలియదని గట్టిగా నమ్మేస్తారు. ప్రతి రిఫరెన్సు దిలీప్‌కుమార్ దగ్గరో, సాహిర్ దగ్గరో ఆగిపోతూంటుంది. అంతకు కిందకు దిగదు. దిగితే ఏం ఉంటుందో తెలీదు.

మొన్న 'బైజు బావరా' సినిమా టీవీలో వస్తుంటే హడావుడిగా రికార్డు చెయ్యడం మొదలుపెట్టాను. ఎనభైఏళ్ళు పైబడిన మా అమ్మమ్మ సోడాబుడ్డి కళ్ళద్దాలు పెట్టుకుని మెల్లగా నడుచుకుంటూ వచ్చి దీవాన్ మీద కూర్చుంది. గొంతు నరాలు పొంగేలా 'బైజూ బావరా' అంటూఆవిడ కళ్ళల్లోకి చెప్పాను. చెవుల్లోకి చెపితే వినిపించదు. "నౌషాద్ మ్యూజిక్కే!" అంది కళ్ళు మిలమిలమెరుస్తూ, తళతళలాడే పళ్ళు కనిపించేలా నవ్వుతూ. (ఆవిడకి ఒక్క పన్ను ఊడలేదు). ఆవిడ ఫేవరెట్ మ్యూజిక్ డైరెక్టర్ నౌషాద్. ఇంట్లో వాళ్లు కాస్త ఎక్కువ సున్నితంగా 'ఈవిడ ప్రియుడు నౌషాద్. ఒంటిమీద ఈగ వాలనివ్వదు' అంటూ డిక్లేర్ చేస్తారు.

నౌషాద్ పేరు గుర్తొస్తూనే అమ్మమ్మ ఎదుటి సినిమా మర్చిపోయి గట్టిగా కళ్ళు మూసుకుని 'ఫిర్ సుబహ్‌కా ఆలమ్ క్యాహోగా?' అంటూ చరణంలో మధ్యముక్క పాడుతూ



"మొగలే ఆజమ్" లోకి జారిపోయింది. 'బైజుబావరా' పాటలన్నీ హాయిగా అందరూ వినేశారు- కొబ్బరికోరుతూ, కాఫీలు తాగుతూ, బియ్యాలు కడుగుతూ, బట్టలు ఆరేస్తూ. భరత్‌భూషణ్, మీనాకుమారి యమునలో కొట్టుకుపోవడంతో సినిమా ముగిసింది.

మా అమ్మ కూర పోపులోవేసి దింపింది.

> **నాకెందుకో ఆరోజు సాహిర్ కవిత్వం గుర్తొచ్చింది. అలాంటి సంఘటనని బ్రహ్మాండంగా పాటగా రాయగలిగే కవి ఎవరైనా ఉన్నారంటే సాహిరేకదా అనుకున్నాను**

మధ్యాహ్నం భోజనాల దగ్గరంతా నౌషాద్ గురించి కబుర్లు.

ఎన్ని ఆనందాల సమాగమం జీవితం అవుతుందో ఎప్పటికీ అర్థంకాదు. కాకూడదు కూడా. కాకుండా ఉంచుకునే కొంత అరాచకత్వం మనసుకి, అర్థం చేసుకోవడాకి మోసపూర్వకంగా చేసే ప్రయత్నం బుద్ధికి ఉంది. అప్పుడు సంగీత సాహిత్యాలు ఒంటపడతాం.

రోషన్ కంపోజ్ చేసిన పాటల్లోని ఇంటర్‌బ్యాడ్స్ తూకంగా, మపొంపుగా, అందంగా పేర్చిన పూల మాలల్లా ఉంటాయని నాకు మహా ఇష్టం. రోషన్ చాలామంచి పాట సాహిత్యం సాహిర్ రాసిందే!

మా వాళ్ళకి సాహిర్, అమృతాప్రీతమ్‌ల ప్రేమకథ చాలా ఇష్టం. ఆ దూరదర్శన్ వాళ్ళో, ఎవరో ఆవిడకి ఏదైనా రాస్తున్నట్టు నటించమంటే సాహిర్ పేరు రామజంలా రాసేసి పేజీ నింపేసిదిట. తర్వాత కంగు పత్తే అర్థం అయిన విషయ ఏమిటంటే- టీవీ కెమెరా చిన్న అక్షలలో రాసినవి పట్టలేదని--! ఆవిడ ఊపి తీసుకుందట.

సాహిర్ ప్రేమికుడిలా ఒటరిగా ఎలా చచ్చిపోయాడో చెప్పుకుని జాలిపద సంగీత క్షణం లేదు.

ఆ మధ్య ఒక పాత స్నేహితుడు తారసపడ్డాడు- దీపావళి పటాసు కొనే షాప్‌లో- పాత ముస్లిమ్ ఫ్రెండ్. పటాసుల షాప్ అతనిదే.ఒకప్పుడు మా క్లాసులో ముగ్గురు, నలుగురు చదివాళ్ళలో అతని పేరు మొదట చెప్పుకోవాల్సొచ్చేదిమహా సిగ్గరి. చాలా అందమైన దస్తూరితో తలవచుకుని గబగబ పరీక్ష పూర్తిచేసివెళ్ళిపోయే అతని ముఖం మళ్ళీఅనుకోకుండా ఇలా దీపావళి పొద్దున్న కనించడంతో మహా ఆనందపడిపోయి గబగబా దగ్గరికి వెళ్ళి మాట్లాడాను. నాకెందుకో ఆరోజు సాహిర్ కవిత్వం గుర్తొచ్చింది. అలాంటి సంఘటనని బ్రహ్మాండంగా పాటగా రాయగలిగే కవి ఎవరైనా ఉన్నారంటే సాహిరేకదా అనుకున్నాను. మంచిపాట.పాతపాట-మళ్ళీ పాడుకోవాలనిపించే పాట.

** ** **

"నేను లెబనాన్ అమ్మాయిని" అంటూపరిచయం చేసుకుంది సాన్యా ఆ పార్టీలో-

"చాలా అందమైన దేశం అని విన్నాను మీదంతా మెడిటరేనియన్ వాతావరణం అందమైనవసంత కాలం- పువ్వులూ..." అంటూ ఆగిపోయాను.

భారతదేశం వాళ్ళంటే కొద్దోగొప్పో అభిమానం చాలా దేశాలవాళ్ళకి- ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ జనాలందరూ అంతోఇంతో త్వరగా దగ్గరవుతారు.

సాన్యా కళ్ళు పెద్దవిచేసి గబగబా మాట్లాడెయ్యడం మొదలుపెట్టింది. ఆ అమ్మాయి మహాఅందగత్తె. రాజకుమార్తెలా ఉంది. పొడుగైన నొక్కులజుట్టు, కోలముఖం, పసిమిఛాయ, మెరిసే నల్లటికళ్ళూ, ఒత్తయిన రెప్పలూ- 'మళ్ళీ వీలైతే లెబనాన్‌లో వెళ్ళే బతకాలనిపిస్తుంది- కానీ, ప్చ్, అలాంటి రోజు




వస్తుందనుకోను." ఏ దేశ వాళ్ళకి ఆ దేశం గుర్తొచ్చినప్పుడు గుప్పున వచ్చే బుల్లాంటిదే ఆ అమ్మాయి కళ్ళల్లో తొణికిసలాడింది.

కెనడాలో దీపావళి సందర్భంగా ఒక శనివారం నాడు భారతి ఆ పార్టీ ఏర్పాటుచేసింది. నా ఐరిష్ ఫ్రెండ్, భారతికి మంచి స్నేహితురాలు. ఫ్రెండ్‌కి మరో ఫ్రెండ్‌గా ననూ పిలిచారు. అందరూ కొత్త. "కెనడాకి వచ్చిం తర్వాత వెనక్కి వెళ్ళడం కష్టం" అంది సాన్యా. అప్పటికి మరో పదిరోజుల్లో నా ఇండియా తిరుగు ప్రయాణం ఖాయమైంది. సాన్యా మాటకి పైమాట చెపుదామనుకుంటుండగా వినిపించింది ఆ పాట. ఫెహరోజ్ అనే లెబనీస్ గాయకురాలు పాడిన పాట. ఒక్క గెంతులో సీడీ ప్లేయర్ దగ్గరకి వెళ్ళాను 'ఇదెలా తెలుసు మీకు?' అంటూ, భారతి నన్ను చూసి నవ్వుతూ- 'దుబాయ్‌లో కొన్నాను. నీకెలా తెలుసు?'

ఫెహరోజ్ ఎంత గొప్ప గాయనో గబగబా పాఠం చెప్పినట్టు చెప్పాను. సాన్యా ఆనందపడిపోయింది. నా తెల్ల కెనేడియన్ పరిచయస్తులు 'ఇంట్రెస్టింగ్' అంటూ ఆశ్చర్యపోయారు.

"నీకు అరబిక్ వచ్చా?" సాన్యాని అడిగాను.

'ఓహో' అంటూ పాట అర్థాన్ని చెప్పింది. అందమైన అరబీ ప్రేమ పాట. "నేను అర్థం తెలీకుండా ఈ పాట ఇన్నిసార్లు విన్నానో?" వాపోయాను.

"ఈవిడ లెబనీస్ కదా!" ఇంకా ఏదైనా విందామని నా కుతూహలం.

"అవునుకో- ఈవిడ పాటలు మొత్తం మిడిల్ ఈస్ట్, ఇరాక్, సిరియా- అరబిక్ మాట్లాడే చోట్లంతా పిచ్చి పాపులర్. చాలా గొప్ప సింగర్. లెబనాన్‌లో చాలా పేరు" సాన్యా వివరిస్తూ పోతోంది.

"అంతే నీకు అరబిక్ బాగా వచ్చునన్నమాట."

"ఓ-

"ఒసామా బిన్‌లాడెన్ మాట్లాడేది అర్థం అవుతుందా?" వరో అడిగారు. సడెన్‌గా అరబిక్ అనగానే అలా ఒసామా బిన్‌లాడెన్ ప్రస్తావన తెచ్చెయ్యడాన్ని విని కంగారుపడ్డాను.

"అనంతా అరబిక్‌లోనే మాట్లాడుతాడు కదా- అర్థం అవుతుంది. అప్పుడప్పుడు ఆఫ్ఘనీ పదాలో, పర్షియనో వాడతాడు. అవి అర్థంకావు. మోర్ ఆర్ లెస్ కరెక్ట్‌గానే తర్జుమా చేస్తారు టీవీలో."

"ఇప్పుడు అల్‌కయిదా లెబనాన్‌లో చాలా పాకిపోయిఉంది. ఒకప్పటి స్థితి రావాలన్నా రాదు, అంతత్వరగా" అంటూ ఒక ఫిలసాఫికల్ చిరునవ్వు నవ్వింది సాన్యా.

కొన్ని వందల ముస్లింలు ఎన్నో భిన్న స్థితులలో ప్రపంచం మొత్తం మీద తమ మతం గురించి ఏమాత్రం ఆలోచించకుండానో, అదే ఆలోచిస్తూనో, తమ దేశాలు పోగొట్టుకున్న సంపద, సంయమనం గురించి బాధపడుతూనే, బాధపడకుండానో బతుకుతున్నారు. వాళ్ళకి తప్ప మిగిలిన ప్రపంచానికి అది చాలా సహజమైన 'చారిత్రాత్మక'మైన విషయం.

అదే పార్టీలో నా శరీర ఛాయలో ఉన్న మరో ఆవిడ నన్ను చాలాసేపు చూసి దగ్గరకి వచ్చి 'రాజీ'గా పరిచయం చేసుకుంది.

"మీది హైదరాబాదా? నాదీ హైదరాబాదే, సింధ్" అంది. హైదరాబాద్, దక్కన్, సింధ్ వివరణ కెనడా, అమెరికాలలో ఉన్న భారతీయ, పాకిస్తానీయులు ఇప్పటికీ ఇచ్చుకుంటారు- రాజీ సింధ్‌లో పుట్టిన హిందూ సింధీ- పార్టిషన్‌లో ఇల్లూ, ఆస్తీ వదిలేసి వేరే దేశాలకు వెళ్ళిపోయారు.

> **జాతులూ, సంస్కృతులూ మనుషులుగా తిరగడం ఇప్పుడు ప్రపంచంలో అందరికీ కష్టంగా అనిపిస్తోంది**

"కొన్ని సంవత్సరాల క్రితం వెళ్ళి చూసొచ్చాను. మా ఇల్లు ఇంకా అలానే ఉంది. పాతబడిపోయింది కానీ- అలానే ఉంది!"

చలికాలం తిరుగుతోంది. దగ్గర్లో ఉన్న సరస్సు మీంచి వచ్చేగాలి ఇంటి ముందు నిలబడి సిగరెట్లు కాలుస్తున్న మా అమ్మాయిలందర్నీ జరజరమనిపిస్తోంది.

"నువ్వు బాలీవుడ్‌లో సినిమా తియ్యాలి- నేను హీరోయిన్‌గా వేస్తాను- ప్లీజ్, ప్లీజ్!" అంటూ నాటకీయంగా బతిమాలింది సాన్యా, గుప్పుగుప్పున పొగ వదుల్తూ.

"తప్పకుండానూ" అన్నాను నవ్వుతూ.

భారతికి ఏదో అనుమానం వచ్చి తలుపుతీసి బయటకి వచ్చి దంగైపోయింది. "అయ్యో ఈ ముస్లిం, హిందూ అమ్మాయిలు ఎలా సిగరెట్లు కాలుస్తున్నారో- డ, డ, డ- కాలం మారిపోయింది!"

ఫెహరోజ్ పాట, సాన్యా మాటలు- ఆ రాత్రి నా మస్తిష్కంలో ఒక కొత్త చారిత్రకతని ప్రవేశపెట్టాయి.

• ** ** **

ఇండియాలో దిగి వారంరోజులు కూడా కాలేదు. "యూసఫ్ ప్రియా చుట్టూ తిరుగుతున్నాడు" హిందీలో నా ఉత్తరీ ఫ్రెండ్ గబగబా గాసిప్‌లోకి దిగిపోయింది.

"అవునా?" అన్నాను ఆవలిస్తూ. నాకేం పెద్ద ఆశ్చర్యంగా అనిపించలేదు. యూసఫ్ ఎవర్నైనా ప్రేమిస్తున్నాడా అని గ్రహించుకోవడం అతనికి సాధ్యంకాదు. పక్కవాళ్ళు సాధ్యపడనివ్వరు. వేరే వాళ్ళకి సాధ్యంకాదు.

"ఈ ముస్లిం కుర్రాళ్ళు ఉన్నారు చూడు, అబ్బ!"

"ఆc అందరూ యూసఫ్‌లా ఏం ఉండరు. నేనైతే 'హమ్మయ్య, ఇప్పటికైనా పడ్డాడు కదా ప్రేమలో' అంటాను. అంతే!" నా స్నేహితురాలు నిరుత్సాహపడింది.

మల్టీకల్చరల్, మల్టీ లింగ్యువల్ అని చెప్పుకునే సమాజాలలో, అదేం విచిత్రమో, ఎప్పుడూ పోలారిటీని చూసే భయపడుతుంటారు.

"ఆహా, హిందూమతం మించిన గొప్ప మతం మరోటిలేదుకదా, మా మతం అలా లేదేంటి?" అని ముస్లింలంతా వాపోతే బావుణ్ణని హిందువులందరికీ కోరిగ్గా ఉంటుంది.

మనం ఎప్పుడూ ముస్లిం కవులని, నటులనీ చాలానే ఆదరిస్తున్నాంకదా అని బ్రాహ్మణ ఇళ్ళలో తర్జనభర్జన జరుగుతూనే ఉంటుంది.

మా హిందీ స్నేహితురాలికి ముస్లిం కుర్రాళ్ళు ఎక్కువ బుద్ధిగా అందరి మెప్పు పొందడానికి కృషి చేస్తే బావుండుననిపిస్తూ ఉంటుంది.

అమెరికా, కెనడా తెల్లజాతీయులకి ఒసామా బిన్ లాడెన్ అనే 'ఇస్లామిక్ టెర్రరిస్ట్' దొరికితే- శాంతియుత ఇస్లామ్ వాళ్ళ దేశాల్లో శోభిల్లే అవకాశం, ఆ మతం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందనిపిస్తుంది.

పాకిస్తాన్ అనే పదార్థం పటం నుంచి లేచిపోతే బావుణ్ణని ప్రతి ఇండియన్ మనస్సులోనూ కోరిక ఉరకలేస్తూ ఉంటుంది.

జాతులూ, సంస్కృతులూ మనుషులుగా తిరగడం ఇప్పుడు ప్రపంచంలో అందరికీ కష్టంగా అనిపిస్తోంది.

ఎంత బలంగా ఉన్నాయో చూడడానికి అంత ధ్వంసం తప్పదంటున్నాయి అన్ని వర్గాల పెద్ద చేపలూ. వాటి కడుపుల్లోని చిన్న చేపలు చాలా వరకూ అరిగిపోయాయి.

ఈ కాలంలో పాటలూ, కవిత్వం ఏమిటీ? సాహిర్ లేడూ, మరెవరూ లేరు.

అన్నీ తుప్పు తుపాకీ శబ్దాలే! ●